# మార్పు జీవసుగంధం

రామస్వామి అని నాతో చిన్నప్పుడు చదువుకున్నాడు. వాళ్ళింటి పేరు 'మార్పు' వారు. ఇంటి పేరుకి తగ్గట్టుగా అతను ఎప్పటికప్పుడు ఏదో ఒక మార్పుకి లోనవుతూ వుంటాడని ఆ రోజుల్లో ఊహించలేదు. అతను స్కూలు ఫైనల్ వరకు లెక్కల గ్రూపు తీసుకొని ఇంటర్మీడియేట్‌లో (వైద్య విద్య ధ్యేయంగా) బయాలజీకి మారి, మెడిసిన్‌లో సీటు రాకపోవడంతో బి. ఎ. హిస్టరీ పాలిటిక్సు, ఎకనామిక్స్‌తో చదివాడు. ఆ చదువుతో అతనికి సరైన ఉద్యోగం రాలేదని తెలుగుతో ఎం. ఎ. చదివి దాంట్లో పి. హెచ్. డి. చేసి వాళ్ళ బాబాయి గారొకాయన రాజకీయాల్లో వున్న కాలంలో యూనివర్శిటీ తెలుగు డిపార్టుమెంట్‌లో లెక్చరర్ ఉద్యోగం సంపాదించేశాడు. అతని క్లాసులో చదువుకునే కుర్రాళ్ళంతా అతని పాఠం శ్రద్ధగా వినలేక మార్పు కోరుతూ వుండేవారు. అది వేరే సంగతి.

నాకేమో కోర్టు హెడ్డాఫీస్‌లో ఉద్యోగం; క్వార్టర్సు సాంబమూర్తి నగరం కావడాన్ని కాన్వెంటు జంక్షన్ దగ్గిర బస్సు మార్పు తప్పేదిగాదు. ఓనాడు అక్కడ కనబడ్డాడు రామస్వామి "రాజగోపాలం కదూ ? ఎంత మారిపోయావ్ ?" అన్నాడు.

"క్షమించాలి. నా పేరు రాజగోపాలం కాదు, రామగోపాలం" అన్నాను.

అతను చిరునవ్వు విసిరి "నేననుకుంటూనే వున్నాను. తస్సాదియ్యా, పేరు కూడా మార్చేసుకున్నావన్నమాట!" అంటూ పదమూడో నెంబరు బస్సు కనబడగా అటువేపు లఘువు తీసేడు.

ఒకటి మాత్రం నిజం. అతను చదువుకునే సబ్జక్టులు మార్చినట్టుగా ఎప్పటికప్పుడు వేషం మార్చాడు. ఇళ్ళు మార్చాడు. ఇద్దరు ముగ్గురు ప్రియురాళ్ళను కూడా (ఏ) మార్చాడు. చివరికి తనే మారిపోయాడు. ఎంత మారిపోయాడంటే నన్ను గుర్తుపట్టలేనంత!

ఇంటికెళ్ళి మా ఆవిణ్ణి తరిచీ తరిచీ అడిగాను. "నాలో ఏమైనా కొట్టొచ్చినంత మార్పు కనబడ్డాదా" అని.

"ఆఁ రాకేం? ఇదివరకు కోపం వచ్చినప్పుడల్లా కొట్టొచ్చేవారు. ఇప్పుడు వోపిక లేక్కాబోలు, కొట్టడం మానేశారు. కోపమూ రావడంలేదు!" అంది.

అక్కడికి ఆ అవమానాన్ని దిగమింగి అందుబాట్లో వున్న సాహిత్యంమీద పడ్డాను. తీరుబాటుగా వున్నాను కదా అని.

అందులోను విస్పష్టమైన మార్పు కనబడింది. దేశానికి స్వతంత్రం రాకముందు; ఆ తరువాత పది పన్నెండేళ్ళ వరకూనూ, సాహిత్యం సిగ్గరిగా, గుంభనగా ప్రతీక ప్రధానంగా వుండేది. అల్పాక్షరాలతో అనల్పార్థదాయినిగా వుండేది. అదంతా రసాయనిక మార్పులాంటి చర్యకు గురైంది. ఇటీవల ప్రబంధ యుగం తరవాతోచ్చిన మధ్య యుగంలో తేలినంత శృంగారాన్ని "వొలకబోసుకుని" రావడం మొదలైంది. అదింకా జనం ఆలోచనా ధోరణిలో పూర్తిగా మార్పు తీసుకురాకముందే మళ్ళీ సాహిత్యం ధోరణిలో మార్పు వొచ్చేసింది. రసాత్మకమైన వాక్యం తొణికిసలాడవలసిన కావ్యంలో దయ్యాలు

తిరగడం ఆరంభించేయి. వీధి బడితో చదువు ఆపేసినవాళ్లు కూడా చేత బడి గురించి మళ్ళీ చదువులో పడ్డం మొదలైంది.

"మార్పు ప్రకృతి ధర్మం. ఒక సత్సంప్రదాయం. జనావళిని మందకొడిగా చేసేకండా జీవిత సూత్రాలు కొత్తవి పుట్టుకొస్తాయి అన్నాడు టెన్నిసన్ దొరగారు. అందుకే కాబోలు, ఎంతో నీతితో, మిక్కిలి నిజాయితీతో ధర్మ నిర్వహణ చేసే ప్రముఖులు కొందరు యాభయ్యో పడిలో పడేసరికి లంచ-మంచాలకి దాసానుదాసులై పోతున్నారు.

సోమయాజులుగారని; మా నాన్నగారికి చిన్నాయనగారు. ఆ రోజుల్లో బారెట్లా అయి, ప్రాక్టీస్ పెట్టారు. ఆయన ప్రాక్టీస్‌లో ఎక్కువభాగం ప్రభుత్వోద్యోగులమీద వచ్చే అభాండాలమీద ఆధారపడి వుండేది. "తాతయ్యగారూ; లోకంలో సివిలూ, క్రిమినలూ భేదాల్తో ఇన్ని లిటిగేషన్లున్నాయే, ప్రతి అవిభక్త కుటుంబంలోంచి ఒక భారతం. ప్రతి కుగ్రామంలోంచీ ఒక రామాయణం పుట్టుకొస్తుంటే అవన్నీ చూడ్డం మానేసి ఇలా గాలిలో గడ్డిలా తేలిగ్గా వుండే ఈ కేసులేమిటి చెప్పండీ" అని అడిగాను.

"నేనేం వెర్రివాణ్ణి కాదొరే మనుష్యుల జీవన విధానాల్లో మార్పు రావొచ్చు. ఆలోచనా సరళిలో వేషభాషల్లో అనుభవ స్వభావాల్లో, ఆహార విహార వ్యవహారాల్లో; నైతిక సామాజిక ఆర్థిక రాజకీయ రంగాల్లో ఎన్ని మార్పులొచ్చినా రావచ్చు. కాని ప్రభుత్వోద్యోగుల కాండక్ట్ రూల్స్ మాత్రం బ్రిటిష్‌వాడు ఎలా పెట్టాడో అలాగే వుండిపోయాయి యిప్పటికినీ. అంచేతనే నేనీ జీవగర్రని జీలకర్రలా నమ్మి నవిలేస్తున్నాను. మార్పుకి లొంగనివి యిదొక్కటే!" అన్నారు మా తాతగారు ఆ రోజుల్లో. ఇప్పుడాయన లేరు. కాని పరిస్థితి అలాగే వున్నట్టుంది.

మార్పు అంటే ఛేంజ్.

ఛేంజ్ అంటే మళ్ళా చిల్లర.

చిల్లర అంటే సిల్లీ — అనుకుంటూ పోతే పదవి పరిణామంలో చాలా డ్రిల్లు చెయ్యొచ్చును. ఇలాంటి సౌమ్యం జార్జిమికే ఒకటి చెప్పేడు.

రోడ్డమ్మట వెడుతున్నప్పుడు స్కూటర్ వాలాని ఆపి లిఫ్టు ఇమ్మంటే ఖాళీగావున్న వెనుక సీటుమీద కూర్చోనిమ్మని అడగడం అన్నమాట. ఆఫీస్ కొచ్చేక మెట్లెక్కడానికి ఓపికలేక నిరీక్షించి ఆశ్రయించే లిఫ్ట్ వేరు (అధికార పరమపదసోపాన పటంలో లిఫ్ట్ రావడం మళ్ళీ మరోటి) ఈ బాధలు పళ్ళేక- మనం అంతస్తు లెక్క-డానికి వాడేదాన్ని అమెరికన్లు "ఎలివేటర్" అంటున్నారు. అదే ఎలివేటర్‌లోంచి ఎలివేట్ అనే ధాతువు అమెరికా నుంచి యూరప్ వస్తే మద్యం సహాయంతో మనిషికి కలిగే ఆరోహణాస్థితి అవుతుందిట. నిజానికి అది ఆరోహణ కాదు, అవరోహణ. అంచేత పదవి పరిణామంలోంచి అర్థ విపరిణామం కూడా అని ఓ వాదం వుంది.

అలాంటి గడుసుతనం నేనోసారి విజయవంతంగా మా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు మీద ప్రయోగించాను.

ఏం లేదు, నా కతను యాభై రూపాయలు బాకీపడ్డాడు. ఇందాక చెప్పేనే; మార్పు అంటే ఛేంజ్ అని; ఛేంజ్ అంటే చిల్లర అని- ఆ ఛేంజ్ లేక అతను నా చేతికి నూరు రూపాయల కాగితం ఇచ్చేడు.

"నా దగ్గిరా చిల్లర్లేదు" అన్నాను.

"మార్చి తరవాతియ్యి" అన్నాడతను.

నేను చిరునవ్వు పారేసి "అలాగే, మార్చి తరవాతే యిస్తాను" అన్నాను.

ఒక్క నిమిషం పోయేక అతనికి వెలిగింది.

ఎందుకంటే ఆవేళ యింకా డిశంబర్ ఫస్టు!

(27.2.84)